తోటి ఆడపిల్లలలాగా వికసించలేని, ఎదగలేని అమ్మాయిలు అనుభవించే మానసిక క్షోభ, ఎదుర్కొనే సామాజిక సమస్యలు, దాన్నుంచి బయటపడడానికి చేసే ప్రయత్నాలు, వారిపట్ల కుటుంబం, సమాజం స్పందించాల్సిన తీరును కథావరణంలోకి తీసుకురావడానికి చేసిన ప్రయత్నం,


వి. శాంతిప్రబోధ

4

# టర్నర్ సిండ్రోమ్

భాస్కరన్





"శిశువు పుట్టగానే శరీరం మీది అవయవాలు సరిగా ఉన్నాయోలేదో తెలిసిపోతుంది. లోపలి అవయవాల లోపం పసిగట్టలేం కదా... ఎవరిలోనైనా ఏదైనా శారీరకలోపం ఉందంటే దానికి కారణం ఆ వ్యక్తి కాదు. విత్తనానిది.

"మంచి విత్తనం లేకపోతే పూలు, పండ్లు ఎలా వస్తాయి?" అన్నది నీల.

ఆమె తమ ఊరు వెళ్లి ఇప్పుడే వచ్చింది. వాళ్ల ఊరు మేముండే పల్లె కాని పల్లెకు పెద్ద దూరమేమీకాదు. అయినా ఎప్పుడో అవసరమైతే తప్ప వెళ్లదు. రెండురోజులు సెలవు పెట్టి ఈ ఉదయం వెళ్లిన మనిషి సాయంకాలానికి వచ్చేస్తుందని అస్సలు ఊహించలేదు. ఆ విషయమే అడిగాను. నేను అడిగినదానికి ఆమె సమాధానానికి పొంతనే లేదు.

అర్థంకాక ఆమె మొహంలోకి పరిశీలనగా చూశా. పైకి ఏ భావాలు పలకకుండా జాగ్రత్త పడుతున్నట్టుంది. వాడిన ఆమె మొహం నిండుసముద్రంలా గంభీరంగా కనిపిస్తున్నా లోపల ఏదో అగ్ని పర్వతం కుతకుత ఉడుకుతున్నట్లుగా అనిపించింది నాకు.

ఇంతకుముందెప్పుడూ నీలని ఇలా చూడలేదు.

అంత చురుకైన మనిషి కాకపోయినా చేసే పనిపట్ల నిబద్ధత గల వ్యక్తి. చెప్పిన పని బరువుగా కాకుండా బాధ్యతగా చేస్తుంది. కల్మషం లేని మనిషి.

తనకోసం ప్రత్యేకంగా ఒక గది ఉన్నప్పటికీ ఉపయోగించదు. హోమ్‌లో పిల్లలతో పాటే ఉంటుంది. పిల్లలందరికీ అమ్మలాగే ప్రేమ, ఆప్యాయత పంచుతుంది. విసుక్కోవడం, కసురుకోవడం నేనెప్పుడూ చూడలేదు. ఒకరో, ఇద్దరో పిల్లలు ఉన్న కన్నతల్లి పిల్లలను నాలుగం టించడం చూస్తాం. కానీ తల్లి కాని తల్లైన ఈ పిల్లకి ఎంత ఓపిక, ఓర్పు అని ఆశ్చర్యపోతుంటా.

తాను ఒక ఉద్యోగి అన్న భావన ఉండదు. అంతా తానై పనిచేస్తుంది. నాతో ఎలా మాట్లాడుతుందో ఆయాలతో మిగతా సిబ్బందితో కూడా అంతే సున్నితంగా సౌమ్యంగా మాట్లాడుతుంది.

రికార్డ్స్ అన్నీ మెయింటైన్ చేస్తుంది. పిల్లల ప్రొఫైల్స్ అప్‌డేట్ చేయడం వంటి పనులేవీ పెండింగ్ ఉంచదు.

వందమంది పిల్లల ఆలనాపాలనా తీసుకోవడం మాటలు కాదు. ఒకసారైతే వంటమనిషి రానప్పుడు అందరికీ తానే వంట చేసింది. హోమ్ కోసం తానేదో కష్టపడి పోతున్నాను అనుకోవడం ఎప్పుడూ చూడలేదు. ఇష్టపడి పనిచేస్తుంది. అందుకే ఆమె అంటే ప్రత్యేకమైన అభిమానం నాకు.

నీల వచ్చిన దగ్గరనుండి నాకెంతో వెసులుబాటుగా ఉంది. రెండునెలల క్రితం నేను మా అమ్మాయి దగ్గరకు వెళ్లి నెలరోజులు ఉన్నప్పటికీ ఏమాత్రం ఇబ్బంది కలగకుండా చూసుకుంది. ఒక్క ఫిర్యాదు కూడా లేదు.

వయసు మీదపడి ఓపిక తగ్గుతున్న నాకు నీల ఓ పెద్ద గిఫ్ట్ అని మా వాళ్లందరితో చెబుతుంటాను.

ఆమె తన స్వవిషయాలు ఎప్పుడూ ప్రస్తావించలేదు. ఒకటి రెండుసార్లు వాళ్ల నాన్న వచ్చి వెళ్లారు. వ్యవసాయ కుటుంబం అని ఆయన మాటల ద్వారా అర్థమైంది.

ఈమధ్య నీల కోసం అడపాదడపా ఓ యువకుడు వచ్చి కాసేపు కూర్చుని వెళుతున్నాడు. బహుశా వాళ్లిద్దరూ ఒకరంటే ఒకరు ఇష్టపడుతున్నారేమో!

ఆ పిల్ల చెప్పలేదు, నేను అడగలేదు, అది తన స్వవిషయం అని.

ఈ పిల్ల పెళ్లయి వెళ్లిపోతే హోమ్ నిర్వహణ కోసం ఎవరొస్తారో ఎలా ఉంటారో అని నాకిప్పటినుంచే దిగులు. నీల రాకముందు ఇద్దరు వచ్చి నెల రోజులైనా కాకుండానే వెళ్లిపోయిన అనుభవం ఉంది మరి. ఆ విషయం ఆలోచిస్తూ నీలని గమనిస్తున్నా.

నా చూపులో ఏ ప్రశ్నలు అగుపించాయో, "ఆ అడవిలో ఎండిపోయిన మొద్దుకు కథలున్నాయో లేదో తెలియదు కానీ నాలాంటివాళ్లకి కచ్చితంగా కథలుంటాయి," దూరంగా కనిపించే అడవిని చూస్తూ అన్నది.

"ఏంటీ?" ఉలిక్కిపడి ఆశ్చర్యంతో అడిగా.

"అవును మేడం, మీతో కాసేపు కూర్చుంటే ప్రశాంతంగా ఉంటుందని ఇటు వచ్చా..." అంటూ నా కళ్లలోకి చూసింది.

తడి ఆరిన ఆమె కంటి లోతుల్లో దాగిన అగాధాలు ఏమిటో తెలుసుకునే ప్రయత్నంలో అప్రయత్నంగానే వెళ్లి ఆమె భుజంపై చేయి వేశాను.

"నీలా... ఏమైందమ్మా... నీ బాధ ఏంటో చెప్పు. నీకు నేనున్నాగా..." ఆమె చేయి పట్టుకుని వత్తుతూ భరోసా ఇచ్చాను.

“ఒకప్పుడు మా నాయనమ్మ దగ్గర ఓదార్పు దొరికేది. కానీ ఇప్పుడు నన్ను అర్థం చేసుకోగలిగింది మీరొక్కరే అనిపించింది,” అంటూ నా భుజంపై తల పెట్టింది.

ఒక క్షణమాగి గుండెను అదిమి పెట్టుకుంటూ లోపలి ముడతల్లో అణచి పెట్టిన మడతలు విప్పి చెప్పడం మొదలుపెట్టింది నీల.

*

అప్పుడు నాకు పదిహేడేళ్లు. ఇంటర్మీడియట్ చదువుతున్నా.

క్లాసులో తోటి అమ్మాయిలు పీరియడ్స్ గురించి చాలా మాట్లాడుకునేవారు. డేట్ వచ్చింది అంటూ ఆ సందర్భంగా వచ్చే కడుపునొప్పి, నీరసం, అసౌకర్యం, దిగులు, కోపం, చిరాకు, మూడ్ స్వింగ్స్, ఇంట్లో అంటూ ముట్టు అని ఎంత కోపమొస్తుందో అని ఒకరు,

మా ఇంట్లో పీరియడ్స్ రాగానే తలస్నానం చేయకపోతే ఊరుకోరు, ఆ తడి తలతో హడావిడిగా రావడం విసుగొస్తుందే అని మరొకరు,

సానిటరీ ప్యాడ్స్ కొనడానికి డబ్బులివ్వరు మా ఇంట్లో, నలుగురు మగవాళ్ల మధ్య ఉండే నేను వాళ్లకి కన్పించకుండా మైల బట్ట ఆరేయడం ఎంత ఇబ్బందిగా ఉందో అని వాపోయేవారొకరు. పాడ్స్ వల్ల వచ్చిన ఎలర్జీ గురించి ఒకరు. మైల వల్ల పూజాపునస్కారాల్లో పాల్గొనలేకపోయామని ఒకళ్లు, పండుగ చేసుకోలేదని ఒకరు, డేట్‌కి ముందు టాబ్లెట్ వేసుకున్నానని ఒకళ్లు చెప్పుకునేవారు.

షాప్‌కి వెళ్లి పాడ్స్ తెచ్చుకోవాలంటే సిగ్గేస్తుందని మరొకరు అనేవారు.

మా పిన్ని హిస్టరెక్టమీతో ఈ బాధనుంచి విముక్తి పొందిందంటే మరొకరు అబ్బా మనకెప్పుడో... విముక్తి అనేవాళ్లు.

సృష్టి కొనసాగింపుకు భరించాల్సిందే అని ఒకరంటే, అది మనకు వరం, పిల్లలను ఆడవాళ్లు మాత్రమే కనగలరు, మగవాళ్లు కనలేరుగా... అందుకే నేనో ప్రత్యేకమైన వ్యక్తిని అని ఒక్కోసారి గర్వంగా ఫీలవుతూ ఉంటా అనేది మంజుల.

కాలేజీలో టాయిలెట్స్ లేవని తిట్టుకునేవారు. కాలేజీకి వచ్చాక పీరియడ్స్ వస్తే మరింత ఇబ్బంది పడిపోయేవారు. పీరియడ్స్ వచ్చాయని కాలేజీకి వచ్చేవారు కాదు మరికొందరు.

కాలేజీకి వెళ్లేప్పుడు, తిరిగి వచ్చేప్పుడు ఇటువంటి మాటలే నడిచేవి నా కాలేజ్ మేట్స్ వేద, నాగమణి, జయమ్మ, పద్మ, సునీత, విజయలక్ష్మి, కనక, పుష్ప, మంజులల మధ్య.

మేమంతా ఓ జట్టుగా కాలేజీకి పోయేవాళ్లం. జట్టులో ఎప్పుడూ ఒకరో ఇద్దరో మిస్ అవుతూ ఉండేవారు. గుంపులో గోవిందా అన్నట్టు వాళ్లతో కలిసి నడవడం తప్ప నా గొంతు ఎప్పుడూ కలపలేదు.

ఇంట్లో నేనెప్పుడూ ఆ మాటలు వినలేదు. అమ్మ, నానమ్మ ఇంటిపని, పొలం పనులతో ఎప్పుడూ తీరిక లేకుండా ఉండేవారు.

ఓరోజు లంచ్ అవర్‌లో అందరం కలిసి భోజనానికి కూర్చున్నప్పుడు మంజుల అడగనే అడిగింది, రుతువులు మారాయా అని. ఆ మాట నాకస్సలు అర్థం కాలేదు. ఆ తర్వాత నువ్వెప్పుడు అయ్యావని సూటిగా అడిగింది.

అప్పటికి బోధపడింది ఆమె ప్రశ్న. కానీ ఏమని చెప్పను?

నోరు తెరవలేదు. అప్పటికే నోరు తెరిచి ఎక్కువ మాట్లాడనని మూగ మొద్దు అనే పేరు వచ్చేసింది. నేనూ అలవాటుపడిపోయాను. కానీ ఇప్పుడెందుకో మనసు కలుక్కుమంది.

అందరి చూపులు నన్ను గుచ్చుతున్నాయి. కొద్దిక్షణాల తర్వాత ఇంకా కాలేదు అని చెప్పాను. ఇంకా కాలేదా... అని ఆశ్చర్యపోయారు. తర్వాతనుంచి నువ్వు చిన్నపిల్లవు నీకు తెలియదులే... అనేవారు.

వాళ్లలో వాళ్లు ఏదో చెప్పుకుని నవ్వుకునేవారు. నేనంత పట్టించుకునేదాన్ని కాదు.

వాళ్లందరిలా లేను అని అర్థమైంది. ఎందుకు అని ప్రశ్న మొదలైంది

ఎవరిని అడిగితే చెబుతారు?

అమ్మని అడిగితే... లేదా నాన్నమ్మను అడిగితే... చాలాసార్లు నోటిదాకా వచ్చినా అడగలేకపోయా. ఏదో బెరుకు, భయం.

నాతోటి అమ్మాయిల ద్వారా రజస్వల అవడం అంటే పెళ్లికి, పిల్లల్ని కనడానికి మన శరీరం సిద్ధం అవడం అని కొంతవరకు అర్థమయింది.

పెద్దమనిషి అవడం గురించి విన్నాగాని శరీరంలో జరిగే మార్పులు ఏమిటో తెలియదు.

ఓరోజు ధైర్యం చేసి అమ్మనడిగితే ఆమె మొహం చిన్నబోయింది. ఆ తర్వాత నవ్వు తెచ్చుకుంది. కానీ సమాధానం రాలేదు. ఆ దిగులు చూపులు నన్ను చుట్టేశాయి.

అమ్మ నుండి సమాధానం రాదని అర్థమైంది.

చెల్లికి తెలుసేమో అడిగితే... ఊహూ... నాకంటే చిన్నది. నాకు తెలియని విషయాలు తనకెలా తెలుస్తాయి? అది ఊరంతా తిరిగి వస్తుంది. చిన్న పెద్ద

లేకుండా అందరూ దాని నేస్తాలే... తెలిస్తే తెలిసి ఉండవచ్చు. కానీ అడగాలంటే ఏదో సంకోచం వెనక్కి లాగింది.

తేనెతుట్టెను అల్లుకుపోయే ప్రశ్నల బరువు తీర్చుకోవడం కోసం ఓరోజు నానమ్మ దగ్గర చేరి అడ్డువచ్చే బిడియాన్ని అష్టకష్టంపై వదిలించుకుని అడిగా...

నాన్నమ్మ నన్ను దగ్గరకు తీసుకుని, "నేలమ్మా... ఎందుకే తొందర. కొద్దిగా ముందు వెనక అంతే," అని భళ్లున నవ్వేసి, "నీకూ త్వరలో వస్తుంది. అప్పుడు, నెలనెలా పిలవకుండానే వచ్చే చుట్టాన్ని చూసి నువ్వే విసుక్కుంటావ్," కళ్లు చిన్నవై నోరు విప్పారుస్తూ అన్నది.

నాన్నమ్మ ఎప్పుడూ అంతే, ముద్దుగా నేలమ్మా అంటుంది. నీలమ్మా అంటాడు నాన్న. బుజ్జి అంటుంది అమ్మ. ఇరుగుపొరుగు అంతా నీల అనే పిలుస్తారు.

ఆ తర్వాత ఓసారి అమ్మ పెద్ద పిల్ల ఇంకా అలాగే ఉంది. చిన్నదాని అందాలు విచ్చుకుంటున్నాయి అంటూ... నాన్నమ్మ దగ్గర ఆ ప్రస్తావన రావడం నా చెవిన పడింది.

"ఆ... లేతపిల్లేగా... హెచ్చుతగ్గులుంటాయిలే... నాకు పెళ్లయిన అయిదేళ్లకు కానీ నేను పుష్పవతి అవలేదు. దానికి నా సాలు వచ్చి ఉంటుంది," అని అమ్మ నోరు మూయించింది.

కానీ ఆ తర్వాత, నేలమ్మ సస్యశ్యామలం అయితేనే మనిషి బతుకు అంటూ ఏమో ఏమో... తనలో తానే మాట్లాడుకుంది నాన్నమ్మ.

ఆ మాటలు అప్పుడు అర్థంకాలేదు, చింతలే కానీ చిగురింతలు లేని జీవితమని.

తొమ్మిదో తరగతికి వచ్చిన చెల్లెలు లీల ఏపుగా ఎదిగిపోతుంటే నేనేమో గిడసబారిన మొక్కలాగా నాలుగున్నర అడుగులు దాటలేదు. అసలే మెడ కురచ. భుజాలు కొంచెం దగ్గరకొచ్చి మరింత చిన్నగా కనిపించేదాన్ని. రొమ్ములు కూడా సరిగ్గా ఎదగలేదు.

నాకంటే చిన్నదాని శరీరంలో ఎన్నో మార్పులు. దానిక్కూడా బెంగ పడలేదు. బాధపడలేదు. మనుషులందరూ ఒకటే విధంగా ఉండరని సరిపెట్టుకున్నా.

కానీ ఎదుగుతున్నకొద్దీ తెలియని ప్రశ్నలు మొదలవుతున్నాయి. సందేహాలు తొలిచేస్తున్నాయి. ఎవరిని అడగాలో తెలియడంలేదు. నాలోని బిడియం, ఆత్మ

న్యూనతాభావం వెనక్కి లాగేవి. సందేహనివృత్తి ఎలాగో అర్థంకాక సతమతమయ్యే దాన్ని.

నాతో కాలేజీకి వచ్చే అమ్మాయిల్లో కొందరికి నేనంటే చాలా చులకన. వాళ్లతో పోల్చుకుని నా ఆత్మగౌరవం దెబ్బతీస్తున్నారని అనిపించేది.

ఎప్పుడూ ఏదోరకంగా నన్ను ఆటపట్టించడం, జోకులేసి నవ్వుకోవడం వాళ్లకి సరదా. వాళ్లేమంటున్నారో అర్థమవడానికి నాకు కొద్దిగా సమయం పట్టేది. నాలో ఆత్మనూన్యత వల్ల వారిలో ఆధిక్యభావన ఉన్నట్లు తోచేది. అంతలోనే నా లోపాన్ని నేనే ఎత్తి చూస్తున్నానా, లేక వాళ్లు చూస్తున్నారా అని అనుమానం కలిగేది. వాళ్లతో పోల్చుకోవడం సరైంది కాదని తెలుసు. అయినా నా వేదన సద్దుమణిగేది కాదు. నా సందేహాలు తీరేవి కావు.

ఆరోజు నాకు బాగా గుర్తు. అంతా ఇప్పుడే జరిగినంత పచ్చిగా ఉంది.

పుష్పకి పెళ్లిసంబంధం కుదిరింది, త్వరలోనే పెళ్లి పెట్టుకుంటారని చెప్పింది నాగమణి.

నన్ను చూసి నవ్వుతూ, ''తాలు గింజ ఎవరు కొంటారే,'' అన్నది వేద.

''నీటి ఊటలు లేని బావిని ఎవరు ఉంచుకుంటారే,'' అన్నది సునీత.

''నీటి చెలిమలు లేని వాగు ఉంటుందా...'' అని నావేపు చూస్తూ నవ్వింది వేద.

''ఆ... ఆ... ఇదిగో ఇక్కడ ఉందిగా...'' అంటూ నన్ను చూపుతూ పెద్దగా నవ్వింది మంజుల.

అదేదో పెద్ద జోక్ అన్నట్టు అందరూ పడీపడీ నవ్వుతుంటే, ''ఛ... ఛ్ఛా... ఏమిటే... పాపం అది బాధపడుతుంది,'' వాళ్లను కోప్పడుతూ అన్నది జయమ్మ..

నా గురించి డైరెక్ట్‌గా, ఇన్‌డైరెక్ట్‌గా సాగే వాళ్ల మాటలు వింటుంటే భూమి బద్దలై నన్ను తనలోకి తీసుకుపోతే బాగుండనిపించింది. తలెత్తి వాళ్లవైపు చూడలేక నా తల నేలకేసి చూసేది.

శరీర ఒంపుసొంపులలో నాకు వాళ్లకు పెద్ద తేడా లేకపోవచ్చు. కానీ నేను అందరు ఆడపిల్లల్లా లేనన్నది నిజం. అంతమాత్రంచేత నన్నెందుకు చిన్నచూపు చూడాలి? అందుకు బాధ్యురాలిని నేనా? కాదుకదా! అని ఉక్రోషంతో ఉడికి పోయాను.

కానీ, ఎదురుతిరిగి వారికి జవాబివ్వగలనా...?

లేదు, భయం భయంగా... లోనుండి ఉబికి వచ్చే దుఃఖాన్ని లోలోనే ఆవిరి చేసేందుకు ప్రయత్నం చేశాను. నా కళ్లలో తడి కనిపిస్తే వేద, సునీత మరింత రెచ్చిపోతారని, వికృత ఆనందం పొందుతారని ఎప్పుడో అర్థమయింది.

నాపట్ల జాలిగా చూస్తూ సానుభూతితో ఊరుకో అన్నట్లు నా పక్కకు జరిగి భుజంపై చేయి వేసింది విజయలక్ష్మి. ఎందుకో ఆ సానుభూతి, జాలిచూపులు కూడా నాకు ఇబ్బందిగానే ఉంది.

కాలేజీ మానలేను. రాలేను. అడకత్తెరలో పోకచెక్కలా ఉంది నా పరిస్థితి.

నాపై నాకే అయిష్టత. నన్ను ఈవిధంగా పుట్టించిన తల్లిదండ్రులపై విసుగు, కోపం. ఎదురుగా కనిపిస్తున్న ఎవ్వరితో మాట్లాడాలని లేదు. చూడాలని లేదు.

తల నేలకు వేలాడేసి మౌనంగా కూర్చున్నా.

నాన్నమ్మ ఆర్థికపుష్టి లేనివాడికి అన్నీ కష్టాలే అంటుంది కానీ శరీరపుష్టి లేనివారికి అన్నీ కష్టాలే అనుకున్నా.

అంతలోనే నా తప్పేమీ లేకుండా వాళ్ల ముందు నేనెందుకు తగ్గి ఉండాలి? ఎదుటివాళ్ల మనసు కష్టపెట్టే శాడిస్టుల అవమానాల మాటలకు నేనెందుకు బాధ పడాలి? ఎందుకు దిగమింగాలి? ఉన్నదేగా వాళ్లంటున్నది. నేలమ్మ నీటితో తడిస్తే పచ్చని పైర్లు... గొంతు పెంచి మాట్లాడలేని నేను నాతో నేను మాట్లాడుకుంటూ ఓదార్చుకునే ప్రయత్నం చేశా. నా శక్తిని కూడగట్టుకునే ప్రయత్నం చేయడం మొదలు పెట్టాను.

కానీ... చిన్నిగుండె బండరాయి కాదు కదా. స్పందిస్తూనే... దహించుకు పోతూనే ఉంది. బుగులు బుగులుగా... దిగులు దిగులుగా... ఎవరికీ చెప్పుకోలేని బాధ గుండెను మెలిపెడుతుండగా ఇంటికి చేరా.

నాకంటే మూడేళ్లు చిన్నదైన చెల్లెలు లీల పెద్దమనిషయ్యింది. పచ్చని ఆకులపై కూర్చోపెట్టారు. ఆమె శరీరంలో వయసు పొంగుల సోయగాలు విచ్చు కుంటున్నాయి .

నన్ను చూడగానే అయ్యో... భగవంతుడా... అంటూ అమ్మ ఒక రాగం తీసింది. ఎవరో చచ్చినట్టు ఆ ఏడుపేంటి అని నానమ్మ అరవడంతో అమ్మ నోరు మూసింది.

ఆ తర్వాత అటు చుట్టాలని, ఇటు చుట్టాలని పిలిచి ఘనంగా ఫంక్షన్ చేసుకోవాలని, ఊరంతా చాటింపు వేయాలని ఆలోచన చేసింది అమ్మ.

కానీ నాన్నమ్మ ఊరుకోలేదు. నీకసలు మతి ఉండే మాట్లాడుతున్నావా... అని అమ్మని కేకలేసింది.

పెద్దపిల్ల కాకుండా చిన్నపిల్ల అయిందని లోకానికి ఎట్లా చెప్పుకుంటావే... గుట్టుచప్పుడు కాకుండా కానిచ్చేయ్ అంటూ అమ్మ నోరు మూయించింది.

చెల్లికి ఫంక్షన్ చేస్తే నేను చిన్నబుచ్చుకుంటానని నాన్నమ్మకు అస్సలు ఇష్టం లేదని అనుకున్నా.

నేనంటే తనకు చాలా ఇష్టం. అమ్మకు వెంట వెంట కాన్పులు కావడంతో అమ్మ ఒడి నాకు దొరికేది కాదు. నాన్నమ్మ ఒడిలోనే ఉండేదాన్ని. ఆమె పక్కనే పడుకునేదాన్ని. ఇంట్లో అందరిదీ నిండు రంగే. నాన్నమ్మది తప్ప. నాకు కూడా నాన్నమ్మలా లేతరంగు వచ్చిందని, ఆమె పోలికలు నాలో ఉన్నాయని మురిసి పోయేది నాన్నమ్మ.

నన్ను పల్లెత్తు మాట అననిచ్చేది కాదు.

ఇక ఊళ్లోవాళ్లకి, అయినవాళ్లకి, కానివాళ్లకి ఆ అవకాశం ఇస్తుందా... ఇవ్వదు కదా... అనుకున్నా. కానీ అసలు విషయం తర్వాత అర్థమైంది.

నేలమ్మది ఆకాశం గొంగట్లో ఆగమైన పొద్దయింది. తొలకరి చినుకులు లేవు... తడిసిన మట్టి వాసనకు పులకరించని జీవితమైంది అని బాధపడుతున్న నాన్నమ్మ మాటలు చెవిలో పడ్డాయి. అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నా.

ఓరోజు కాలేజీ దగ్గరకు నానమ్మ వచ్చి డాక్టర్ దగ్గరకు తీసుకుపోయింది. ఏవో మందులు ఇచ్చారు. అయినా ప్రయోజనం లేదు.

నా ఇంటర్ చదువు అయింది. పుష్పవతి కాకుండానే పెళ్లి చేస్తామన్నారు.

పెళ్లి, పిల్లలు నాకు ఇష్టమే కానీ నేను పెళ్లికి ఒప్పుకోలేదు. చినుకు తడికి చిగురు తొడిగే పువ్వును కాదనీ, మండే ఎండలకు ఆగమైన జీవితమని, వడగాడ్పులు తప్పవని అర్థం చేసుకున్నాక ఎలా పెళ్లి చేసుకోగలను?

నేల ఏర్పడగానే సరిపోతుందా... నేల సారవంతం కావాలి. మొక్కల పెరుగుదలకు అవసరమైన పోషకాలు ఉండాలి. ఈ శరీరం అటువంటి సారవంతమైన వనరు కాదు. ఒకసారి తయారైన ఈ శరీరాన్ని మళ్లీ మళ్లీ తయారు చేసుకోలేం కదా.

ఈ శరీరపు దొంతరల్లో పేరుకుపోతున్న ఒంటరితనాన్ని పెళ్లి తీర్చగలదా. ఈ పొరల కింద దాగిన మనసును అందుకోగలరా. లేదని నా మనసు గట్టిగా చెబుతున్నది.

నేలమ్మ ఆరోగ్యాన్ని కాపాడే బదులు వేటగాడి చేతిలో పెడతామంటున్నారు.

రక్షించాల్సిన చేతులే, అక్కున చేర్చుకోవాల్సిన చేతులే ఆమడ దూరం పెడతానంటే ఈ నేలమ్మ ఏమి చేయగలదు?

చినుకు తడికి చిగురు తొడగలేని నేలమ్మను వీలయినంత త్వరగా వదిలించుకోవాలని ప్రయత్నం. తమ బాధ్యత తీరింది అనిపించుకోవాలని ఆరాటం చూస్తుంటే నావాళ్లే, నన్ను ప్రేమించినవాళ్లే కాటేస్తున్న భావన నాలో.

కన్నవాళ్లే అర్థం చేసుకోనప్పుడు అవతలివాళ్లకు ఎందుకు ఉంటుంది?

మెట్టినింట దీపాలు వెలిగించలేని నన్ను మోసపూరితంగా పెళ్లిచేసి పంపారని తగవులాడరని నమ్మకం ఏంటి? తన్ని తగలెయ్యరని నమ్మకం ఎక్కడుంది?

నా ప్రశ్నలకు జవాబు ఇవ్వలేక, కళ్లలో కళ్లు పెట్టి చూడలేక, అంతా దూరం దూరంగా జరిగిపోతూ, రోజురోజుకు నేను మరింత ఒంటరవుతూ, నేను బతకడం ఎందుకు అనే ప్రశ్న చాలాసార్లు నా ముందుకు వచ్చేది.

దొడ్లో ఏపుగా పెరిగిన బొప్పాయి మొక్క కాయలు ఇవ్వడంలేదని తెగనరికే వరకు ఊరుకోని నాన్నమ్మ, పత్తిచేలో పూత తప్ప కాయ రావడం లేదని, నకిలీ విత్తనం అమ్మినవారిపై కేసు పెట్టాలని అరిచి గొడవ చేసిన నాన్న, వాళ్లకి వంతపాడే అమ్మ నా పెళ్లి చేసి పంపాలన్న పట్టుదలతో ఉన్నారు. తమకి ఒక న్యాయం ఎదుటి వారికి మరో న్యాయం అనే వాళ్ల తీరుకి ఆశ్చర్యం, భయం, బాధ, కోపం నాలో.

ఎప్పుడూ నా వైపు మాట్లాడే నాన్నమ్మ కూడా మారిపోయింది. గుట్టు చప్పుడు కాకుండా పెళ్లి చేసేయాలని తప్ప వేరే ఆలోచన లేదు. అబద్ధపు పెళ్లి నాకు నచ్చడం లేదు.

నీ కడుపున మళ్లీ పుడతా అని చెప్పే నాన్నమ్మ ఆ మాట ఎప్పుడో మరచి పోయింది. నా అనుకున్న అమ్మ నాన్న, నాన్నమ్మ ఎవ్వరూ నావాళ్లు కాదు. నన్ను నన్నుగా చూడడం లేదు. పెళ్లి చేసుకోను అన్నానని పెద్దవాళ్లు బాధ పడుతున్నారు. నీ కోసమే చెప్పేది అంటూ చెల్లి పెద్దరికంగా ఏదో చెప్పే ప్రయత్నం చేసింది. వినలేదని దానికి కోపం. ఆఖరికి చెల్లి, తమ్ముడు కూడా నాతో ముభావంగానే ఉంటున్నారు.

నేను అందరి మాట వినాలి కానీ నా మాట ఎవరికీ అవసరం లేదా! ఉక్రోషం నాలో. ఆందోళనకు గురవుతూ మథనపడుతున్న వేళ విజయలక్ష్మి మా ఇంటికి వచ్చింది. ఉన్న కొద్దిసేపటిలో నా పరిస్థితి అర్థమైయిందేమో!

వెళ్తూ వెళ్తూ నీ గురించి నువ్వు ఆలోచించు. నేను డిగ్రీలో చేరుతున్నా... నువ్వు కూడా చేరితే బాగుంటుంది. ఒకరికొకరం తోడు అన్నది.

నిజమే... నా మాట నేనయినా వింటున్నానా... వినాలి. కనీసం నేనైనా నన్ను నన్నుగా గుర్తుంచుకోవాలి. నాకు నేనే... నాలో నేనే మాట్లాడుకుంటూ, ఓదార్చు కుంటూ, ఆలోచించుకుంటూ...

నా బతుకు నేను బతకాలి.

నాకోసం నేను బతకడం మొదలుపెట్టాలి.

నా జీవనగమ్యాన్ని నేనే నిర్దేశించుకోవాలి అంటే ఏం చెయ్యాలి... ఆలోచనల పరంపర కొత్త దిశగా మొదలైంది.

ఇంట్లో వద్దన్నా వినకుండా డిగ్రీలో జేరిపోయాను. ఖర్చులకు ఒక్క పైసా ఇవ్వనన్నాడు నాన్న. మా ఊరి నుండి ఇంటర్, డిగ్రీ ఏది చదవాలన్నా దగ్గరలోని టౌన్‌కి వెళ్లాల్సిందే.

ప్రభుత్వ రాయితీలు కొంత ఆదుకున్నాయి. అయినా చేతిలో పైసా లేకుండా చదువు కష్టం కదా! పదో తరగతి సెలవుల్లో నేర్చుకున్న కుట్టుపని నన్ను ఆదుకుంది. చదువు, కుట్టుపని ధ్యాసగా బతికాను. నేను డిగ్రీ రెండో ఏట ఉన్నప్పుడే నిండు కుండలాగా కళకళలాడుతూ ఉండే లీల పెళ్లి అయింది.

మనుగుడుపుల అల్లుడు వచ్చిన దగ్గర నుండి అవకాశం దొరికినప్పుడల్లా మీదకు వంగుతూ పెళ్లీ పెటాకులు వద్దంటున్నావట నా కోసమేగా, అంటూ ఎకసెక్కాలు. ఒళ్లంతా కంపరం. అతని దుర్బుద్ధి గ్రహించలేని పసిదాన్ని కాదుకదా!

ప్రకృతి చేసే వికృత చేష్టలకు కారణం నేను కాదు. కానీ దాన్ని సవరించు కోలేమా? ప్రశ్న మొదలైంది.

విజయలక్ష్మి నేను కలిసే కాలేజీకి వెళ్లేవాళ్లం. ఓరోజు అకస్మాత్తుగా, “నువ్వు ఏమీ అనుకోనంటే ఒక మాట చెప్పనా. ఒక్కసారి గైనకాలజిస్ట్‌ని కలిస్తే,” అని నా మొహంలోకి చూసింది.

నాలో ఉన్న ప్రశ్నకు సమాధానం దొరుకుతుందేమో చూద్దాం అనుకున్నాను.

చేతిలో పైసా ఉండడం లేదు, తీరిక లేకుండా డ్రెస్సులు కుడుతూనే ఉన్నా. వచ్చిన డబ్బులు వచ్చినట్టు అయిపోతున్నాయి.

పేకాట అలవాటయిన నాన్న వ్యవసాయం సరిగ్గా పట్టించుకోక నష్ట పోయాడు. ఇంటి అవసరాలకు. తమ్ముడి షోకులకు, కొత్త అల్లుడి మర్యాదలకు నా చేతికొచ్చిన చిల్లర మల్లర పైసలు దారి మళ్లుతున్నాయి.

ఎలాగైతేనేం, ఫైనల్ ఇయర్ చివరలో కొంత సొమ్ము సమకూర్చుకోగలిగాను.

తనువంతా తడిపే చల్లటి కబురు వింటానో లేదోనని గుబులుగా డాక్టర్ దగ్గరకు వెళ్లా. తోడుగా విజయలక్ష్మి వచ్చింది.

నా పరిస్థితి వివరించా. పరిస్థితికి కారణం అడిగింది విజయలక్ష్మి.

జన్యుపరంగా ఏర్పడిన సమస్య. టర్నర్ సిండ్రోమ్ అంటారు అని చెప్పింది డాక్టర్.

"మీరు ఎండోక్రైనాలజిస్ట్‌ను సంప్రదిస్తే అవసరమైన పరీక్షలు చేయించి స్కానింగ్‌లో గర్భాశయం, అండాశయం పరిమాణంబట్టి పీరియడ్స్ కోసం ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ లాంటి మందులు ఇస్తారు. ఫలితం ఖచ్చితంగా ఉంటుందని చెప్పలేం," అన్నారు ఆ డాక్టర్.

ఆశ చావక మళ్లీ డబ్బులు జమేసుకుని విజయలక్ష్మిని తీసుకుని ఎండోక్రైనాలజిస్ట్ దగ్గరకు వెళ్లాను.

కొన్ని టెస్టుల తర్వాత అండాశయం ఎదగలేదు అంటే హార్మోన్లు ఉత్పత్తి చేయవు. చికిత్స అంటూ ఏమీలేదు. హైపోథైరాయిడిజమ్ ఉంది. దానికి మందులు వాడమని చెప్పింది ఆ డాక్టర్.

ఏ మూలో వసంతం వస్తుందేమోననే ఆశ పోయింది.

"దిగులుపడకే, నీకు పిల్లలు పుట్టరు కానీ అందరిలా పెళ్లి చేసుకోవచ్చు," అని సముదాయించే ప్రయత్నం చేసింది విజయలక్ష్మి.

వంశం అభివృద్ధి చేయలేని నన్ను ఎవరు చేసుకుంటారని ఆ ఆలోచన మొగ్గలోనే తుంచేశా.

నిన్నటిని మార్చలేవు. రేపటిని ఊహించలేవు. నేటిని ఆస్వాదించి అనుభవించాలని ఎప్పుడో, ఎక్కడో చదివిన వాక్యం విజయలక్ష్మి నాతో చాలాసార్లు చెప్పేది.

డిగ్రీ అయిపోయింది. విజయలక్ష్మి పెళ్లై హైదరాబాద్ వెళ్లిపోయింది. ఆమె లేకపోయినా ఆమె చెప్పిన ఆ వాక్యమే నాలో గిరికీలు కొట్టడం మొదలెట్టింది.

"నీ జీవితం బాధ్యత నీదే. నీకు నచ్చిన విధంగా నీ జీవితాన్ని మలుచుకో. హైదరాబాద్ వస్తే బోలెడు అవకాశాలు. నీకు అండగా నేనుంటా..." అంటూ ఫోన్ చేసి చెప్తుండేది.

ఆలోచిస్తున్నకొద్దీ నాకు నేను కొత్తగా పరిచయం అవుతున్నా. ఇంట్లోంచి బయటపడాలనుకున్నా. నా నిర్ణయానికి ఇంట్లో ఎవరూ ఒప్పుకోలేదు. నామీద,

నా సంపాదన మీద అధికారం, అజమాయిషీ ఎక్కువయ్యాయి. అది నాకు నచ్చలేదు.

అదీకాక నాన్న బరువు బాధ్యతలు నా మీద వేసుకుని తమ్ముడిని మరింత బాధ్యత లేనివాడిగా చేయడం సరికాదని నా మనసు చెప్పిన మాట విని బయట కొచ్చి మీ దగ్గర చేరాను.

ఇక్కడికి వచ్చాక నాకంటూ మిగుల్చుకోగలిగిన, పదిలపరచుకోగలిగిన గుప్పెడు క్షణాలు మిగిలాయి, అని చెప్పి దీర్ఘశ్వాస తీసి నిట్టూర్చింది నీల.

*

ఆమె మాటలు వింటున్న నా హృదయం భారమైపోయింది. టర్నర్ సిండ్రోమ్ గురించి గతంలో నేనెప్పుడూ వినలేదు. ఇలాంటి సమస్య ఉంటుందా అని ఆలోచిస్తూ... ఏం మాట్లాడాలో తెలియక మౌనంగా ఆమెనే చూస్తూ ఉండిపోయా.

ట్రాన్స్‌లో ఉన్నట్టు మళ్లీ చెప్పడం మొదలుపెట్టింది.

చెట్టువైపు చూపుతూ,

“ఆ చెట్టు ఇచ్చినట్టు నీడని ఆవాసాన్ని ఇవ్వలేనా... నా జీవితం వ్యర్థమేనా... నాకు వసంతాలు ఉండవా... అని ఒకప్పుడు ఏడ్చిన నేను ఇప్పుడు నా జీవితాన్ని ప్రేమిస్తున్నాను. నాకూ వసంతాలు ఉన్నాయనే నమ్మకం, ఆశ ముందుకు నడిపిస్తున్నది,” అని చెప్పి ఒక్కక్షణం నా మొహంలోకి చూసింది నీల.

“కన్నవాళ్లకు దూరమైన మన పిల్లలను చూశాక నన్ను మెలిపెట్టిన గాయాలు చాలా చిన్నవైపోయాయి. కదిలిపోతున్న కాలంతో కలసి ఇలా నడవడం నాకెంతో హాయిగా ఉంది.

“మీకు తెలుసు కదా రాజు. మా ఊరివాడే. అతను ఓరోజు పెళ్లి ప్రపోజల్ పెట్టాడు. హతాశురాలినయ్యాను. నా తమ్ముడితో మా ఇంటికి వచ్చినప్పుడు చూశాడట. నా పద్ధతి, నా ఆలోచన వ్యక్తిత్వం నచ్చాయట. పెళ్లి చేసుకుంటాను అంటున్నాడు. నా పరిస్థితి అంతా పూసగుచ్చినట్లు చెప్పాను. అయినా చేసుకుంటా నంటున్నాడు. ఆలోచించాను. అతనికి ఇష్టమైనప్పుడు కాదనడానికి కారణం లేదు నా దగ్గర. ఆ విషయం మాట్లాడడానికే ఈరోజు ఇంటికి వెళ్లాను.

“మేం పెళ్లి చేస్తానంటే వద్దన్నావు. ఇప్పుడు పోయి పోయి నీకంటే చిన్నవాడిని, కులం గోత్రం లేనివాడిని చేసుకుంటావా. బజారుదాని కొడుకు తప్ప ఇంకే దరిద్రుడు

దొరకలేదా. ఊళ్లో మమ్మల్ని తలెత్తుకోనిస్తావా... ఉరేసుకోమంటావా,'' అంటూ ఇంట్లో యుద్ధం.

“తమ్ముడైతే నా కాళ్లు నరికి ఇంట్లో మూలకు కూచోబెడతానని నా వెంట పడ్డాడు. ఎలాగో బయటపడ్డా..

“అనుక్షణం నన్ను నియంత్రించాలని, నాపై అజమాయిషీ చేయాలని చూసే నాన్న, తమ్ముడు, వాళ్లకి వంతపాడే నాన్నమ్మ, అమ్మలకు నాకంటే ఏది ఎక్కువో అర్థమవుతుంటే...'' కళ్లలోంచి కట్టలు తెంచుకు బయటపడాలని చూస్తున్న కన్నీటిని రెప్పలమాటున దాచడానికి అవస్థపడుతూ కొన్ని క్షణాలు ఆగింది నీల.

నీకు నేనున్నా అని అభయమిద్దామని ఆమె తల నిమురుతూ చెప్ప బోతున్నా... అంతలో,

“నేనేంటో ఎలా ఉండాలో ఏం చేయాలో మెళుకువలోకి వస్తున్నా...'' స్థిరంగా అన్నది నీల.

*కొత్తకథ*
*మే 2022*

✱



24 అక్టోబర్ 1961న వరంగల్ జిల్లా మనపురంలో పుట్టిన **శాంతిప్రబోధ** మొదటి కథ తొలిగిన మేఘం 12 మార్చి 2000 ఆంధ్రప్రభ ఆదివారం సంచికలో అచ్చయ్యింది. దాదాపు 70 కథలు రాసారు. నవలలు, కథలు, కవితలు రాస్తుంటారు. పిల్లల కోసం రచనలు చేయటంతో రచనావ్యాసంగం ప్రారంభమయింది. ఆలోచనల్లో ఆమె కథాసంపుటి ప్రచురించారు. బాలల సాహిత్యం నాలుగు పుస్తకాలు, నాలుగు నవలలు ప్రచురించారు. సామాజిక సేవారంగంలో ఉన్నారు.

***చిరునామా: 3-6-69/402, వెంకట్రామా టవర్స్, స్కైలైన్ సెంటర్***
***బషీర్‌బాగ్, హైదరాబాద్ 500 029***
***ఫోన్: 98667 03223*** **vsprabodha@gmail.com**